క్లుప్తంగా

సీఎస్ఆర్ నిధులు కేటాయించాలి

మణుగూరు రూరల్: బీటీపీఎస్ భూనిర్వాసిత గ్రామాలకు సీఎస్ఆర్ నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఆర్.మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం దమ్మక్కపేట గ్రామస్తులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీటీపీఎస్ నిర్వాసిత గ్రామాల్లో సరైన రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీటీపీఎస్ నిర్మాణానికి తమ భూములను త్యాగం చేసిన నిర్వాసిత గ్రామాల ప్రజలను యాజమాన్యం విస్మరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్వాసిత గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజాపంథా నాయకులు కె.రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ నెల 20 నుంచి జగన్నాథ రథయాత్ర

అశ్వాపురం: మండల కేంద్రంలోని భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో ఈ నెల 20 నుంచి శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. పూరి జగన్నాథ రథయాత్రకు అనుసంధానంగా ప్రతీ ఏడాది గౌతమీనగర్ కాలనీలో ఒరిస్సాకు చెందిన అధికారులు, ఉద్యోగులతో ఏర్పడిన ఉత్కల్ పతాగర్ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 20 నుంచి 28 వరకు ఈ రథయాత్ర ఉత్సవాలు నిర్వహించనుండగా పలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. 20న జగన్నాథ రథయాత్ర, 27 వరకు నిత్య పూజ, 28న బాహుదా యాత్రతో ఉత్సవాలు ముగియనున్నాయి.

ఆయుర్వేద వైద్య శిబిరం

అశ్వాపురం: మండల పరిధిలోని బట్టీలగుంపు గ్రామ పంచాయతీలో శుక్రవారం మండల ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ బట్టా సత్యనారాయణ ప్రారంభించగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆయుర్వేద మందులు అందజేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఆయుష్ ఆరోగ్య కరదీపికలు అందజేశారు. డాక్టర్లు పావని, ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి అజారుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

అన్నపురెడ్డిపల్లి: ఈనెల 20న హైదరాబాద్‌లోని లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవ్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సమస్యల పరిష్కారానికి ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారావు, రంగానాయక్, లకావత్ నాగేశ్వరరావు, భద్రు నాయక్, సత్యం పాల్గొన్నారు.

కృష్ణార్జునరావు సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న నాయకులు

చర్ల: ఏజెన్సీ ప్రాంతంలో నానమ్మాద్రి కృష్ణార్జునరావు చేసిన సేవలు చిరస్మరణీయమని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్ అన్నారు. కృష్ణార్జునరావు వర్ధంతి సభ శుక్రవారం చర్లలో బీఎస్పీ మండలాధ్యక్షుడు కూరపాటి వీర్రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చర్లలోని అంబేడ్కర్ సెంటర్‌లో కృష్ణార్జునరావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కొప్పుల నారాయణ, చింతల కృష్ణప్రసాద్, చింతల సంతోష్, అనిత, తడికల హాస్య, జంపన్న, లక్ష్మీ పాల్గొన్నారు.

సర్ఫేస్ మజ్దూర్లుగా పోస్టింగ్ ఇవ్వాలి

మణుగూరు రూరల్ : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో ఎన్నో ఏళ్లుగా వివిధ కేటగిరిల్లో పని చేస్తున్న కార్మికులకు సర్ఫేస్ మజ్దూర్లుగా పోస్టింగ్ ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ డిమాండ్ చేశారు. పీవీకాలనీలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొండాపురం భూగర్భగనిలో అనేకమంది కార్మికులు ఏళ్ల తరబడి పని చేస్తున్నారని, వారిలో అర్హత గల కార్మికులకు పైరవీలకు చోటు లేకుండా సర్ఫేస్ మజ్దూర్లుగా పోస్టింగ్ ఇచ్చి న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పెద్దనాగయ్య, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ 'ఏసీడీ' బాదుడు..!

250 యూనిట్ల వినియోగం దాటితే అదనపు డిపాజిట్

- ఆందోళనలో విద్యుత్ వినియోగదారులు
- 2,300 మందికి బిల్‌తో పాటు నోటీసులు?



భద్రాచలం పట్టణంలోని వినియోగదారుడికి బిల్లుతోపాటు వచ్చిన ఏసీడీ చార్జీలు



భద్రాచలం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

భద్రాచలంఅర్బన్: విద్యుత్ శాఖ వినియోగదారులపై మళ్లీ అదనపు వినియోగపు డిపాజిట్లు వసూలు చేస్తోంది. 250 యూనిట్లకు మించి వినియోగించిన వారికి అదనపు బాదుడు నోటీసులు జారీ చేస్తోంది. భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా విద్యుత్‌ను అదనంగా వినియోగిస్తున్న వినియోగదారులకు బిల్లులను త్వరగా చెల్లించాలని దీంతో పాటుగా ఏసీడీ చార్జీలు కూడా చెల్లించాలని అధికారులు సమాచారాన్ని అందిస్తున్నారు. వేలాది రూపాయలు చెల్లించాల్సి రావడంతో వినియోగదారులు లబోదిబోమంటూ విద్యుత్ శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. పెరిగిన విద్యుత్ చార్జీల బిల్లులు చెల్లించలేక సతమతమవుతున్న వినియోగదారులు ఈ అదనపు డిపాజిట్లు చెల్లించాల్సి రావడంతో ఆందోళనకు గురవుతున్నారు. గడిచిన రెండు నెలలు భద్రాచలంలో ఉన్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా వినియోగదారులు విద్యుత్‌ను అధికంగా వాడటమే ఇందుకు కారణం అని తెలుస్తుంది.

ఏసీడీ చార్జీలు ఎందుకు.. ?

విద్యుత్ సర్వీస్ కనెక్షన్ తీసుకున్న సమయంలో తాము వినియోగించే విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఒకటి లేదా రెండు కిలోవాట్ల సామర్థ్యం కావాలని దరఖాస్తు చేస్తారు. దాని ప్రకారం విద్యుత్ అధికారులు డిపాజిట్ తీసుకుని కనెక్షన్ ఇస్తారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగం పెరగడంతో అదనపు వినియోగానికి డిపాజిట్ చెల్లించాల్సిందేనంటూ విద్యుత్ శాఖ నోటీసులు జారీ చేస్తోంది. అదనపు వినియోగం ఉన్న వారందరికీ ఇప్పుడు అదనపు డిపాజిట్ నోటీసులు జారీ చేస్తూ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా దాదాపు 2,300 మందికి విద్యుత్ బకాయిలు చెల్లించని కారణంగానే అధికారులు ముందస్తుగా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. వినియోగదారులు 250 యూనిట్లను వినియోగిస్తే అదనపు వినియోగపు డిపాజిట్లను వసూలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. అంతకంటే తక్కువ వినియోగించినవారికి కూడా నోటీసులు జారీ చేసి చార్జీలు వసూలు చేస్తున్నారు. గతంలో కేటగిరి–2లోని వాణిజ్య కనెక్షన్లకు విద్యుత్ వినియోగం పెరగడంతో ఏ విధంగా అదనపు చార్జీలు వసూలు చేశారో ఇప్పుడు నివాస గృహాలకు కూడా అదే విధంగా నోటీసులు జారీ చేస్తూ డిపాజిట్ల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు ఒక్కొక్కరికి రూ.3 వేల నుంచి మొదలుకొని రూ.5 వేలు వరకు బిల్లులు రావడంతో వాటిని చెల్లించలేక వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు.

ఏసీడీ చార్జీలు కొత్తవేం కాదు



ప్రస్తుతం విధిస్తున్న ఏసీడీ చార్జీలు కొత్తవేమీ కాదు. ఈ ఆర్సీ ఆదేశాల మేరకు నెల ముందే నోటీసులు పంపించాం. సర్వీస్ కనెక్షన్ తీసుకున్నప్పుడు ఎంత విద్యుత్ అవసరమో పేర్కొన్నదాని కంటే అధిక వినియోగం జరిగితేనే ఈ చార్జీలు వసూలు చేస్తాం. రెండు నెలల విద్యుత్ వినియోగాన్ని చూసిన తర్వాతే ఏసీడీ చార్జీలకు నోటీసులు జారీ చేస్తున్నాం. అడిషనల్ డిపాజిట్‌పై వినియోగదారులకు ప్రతీ నెల వడ్డీ కూడా వస్తుంది. వినియోగదారులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– జీవన్ కుమార్, విద్యుత్ శాఖ డీఈ, భద్రాచలం

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్రనామార్చన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు సత్యనారాయణశర్మ, సాయి శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణంలో ఆలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు , పానుగంటి రాఘవులు, చల్లా రమేష్, ఇనపనూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చంద్రుగొండ : మండలంలోని తిప్పనపల్లి, మహ్మద్ నగర్, సత్యనారాయణపురం, పెనగడప గ్రామాలకు నేడు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నర్సింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రం చంద్రుగొండ శివారు ఇమ్మడి రామయ్య బంజర్‌లోని 132/కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి రావికంపాడులోని రైల్వేస్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు నూతన లైన్ ఏర్పాటు చేస్తున్నారని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

చంద్రుగొండ : మండలకేంద్రం శివారు ఇందిరానగర్‌లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం వీధి స్తంభాల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి అంధకారం నెలకొంటుందని దీంతో జనం విషసర్పాల బారిన పడుతున్నారని, ఇతర ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఈ సమస్యపై పంచాయితీ పాలకవర్గానికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. నాయకులు విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమ ఆయుధాలు ఉంటే చర్యలు

కరకగూడెం: అక్రమ ఆయుధాలను కలిగి ఉండడం చట్టరీత్యా నేరమని కరకగూడెం ఎస్సై రాజరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా నాటు తుపాకులు, వేట కొడవళ్లు వంటి అక్రమ ఆయుధాలను కలిగి ఉండకూడదని అలా ఎవరివద్దనైన ఉన్నట్‌లైతే వాటిని పోలీసు వారికి స్వాధీనపరచాలన్నారు. తనిఖీల్లో దొరికితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసు వారికి సహకరించాలని కోరారు.

సీతారామ జిల్లాగా పేరు మార్చాలి

భద్రాచలంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరును సీతారాముల జిల్లాగా మార్చాలని భద్రాద్రి రెవెన్యూ డివిజన్ ప్రజా పరిరక్షణ హక్కుల సమితి అధ్యక్షుడు పిలకా రాము కోరారు. ప్రభాస్ నటించిన ఆదిపురుష్ సినిమా భద్రాచలంలో విడుదల సందర్భంగా ఆయన రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పాలక ప్రభుత్వాలు భద్రాద్రిపై వివక్షత చూపిస్తున్నాయన్నారు. కొండ, గోపి, కృష్ణ, లక్ష్మారెడ్డి, శివారెడ్డి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మెచ్చా జన్మదిన వేడుకలు



అన్నపురెడ్డిపల్లి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

అన్నపురెడ్డిపల్లి: ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మెచ్చా పాల్గొని కేక్ కత్తిరించారు.

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ..

మండల కేంద్రంలోని కంచు పెద్దమ్మ తల్లి, తొట్టిపంపు గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయాల నిర్మాణాలకు ఎమ్మెల్యే మెచ్చా భూమిపూజ చేశారు. కంచు పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ భారత లాలమ్మ, ఎంపీపీ సున్నం లలిత, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, మారగాని శ్రీనివాసరావు, నాయకులు కొత్తూరి వెంకటేశ్వరరావు, పాత్రు వెంకటేశ్వరరావు, జంగాల ఉమ, చల్లా రాంబాబు,భూపతి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా, ఎమ్మెల్యేను ఆయన నివాసం తాటిసుబ్బన్నగూడెంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్డు ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ సోయం ప్రసాద్, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, మల్లిఖార్జునరావు, యుగంధర్, నాయకులు రాజేశ్వరరావు, రమేష్, బాబు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ మండలాధ్యక్షుడు మొరంపూడి అప్పారావు కేక్ కట్ చేశారు. ఎంపీపీ మట్ల నాగమణి, ఎంపీటీసీ శనగపాటి మోహరమణి, సర్పంచ్‌లు సున్నం సుశీల, కీసరి శ్రీను, బైటి రాజేశ్, నాయకులు కొండవీటి రాజారావు, కోండ్రు సుందర్‌రావు, పామర్తి వెంకటేశ్వరరావు, బిక్కుమళ్ల సుధాకర్, రాము, ఊరబెద్ది వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. దార వెంకటేశ్వరరావు, ఎస్డీ రసూల్, మెడ మోహన్‌రావు, ఎన్.వెంకటనారాయణ, లంకా విజయలక్ష్మి, రాజీ, గుగులోతు శ్రీను పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ భాగంగా మొక్కలు నాటారు.

ఆలయానికి ఇత్తడి బిందెలు వితరణ



ఇత్తడి బిందెలు అందజేస్తున్న దాతలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వేదాంతపురం అటవీ ప్రాంతంలోగల స్వయంబు శ్రీ వనదుర్గాంబిక సమేత వన లింగేశ్వరస్వామి వారి ఆలయానికి శుక్రవారం ఓ భక్తుడు 11 ఇత్తడి బిందెలను వితరణగా అందించారు. ఏపీలోని నెల్లూరు జిల్లా కొండాపురం గ్రామానికి చెందిన ముప్పాళ్ల మధు, జయసాయిశ్రీ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేసేందుకు బిందెలను ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమాని శివశంకర్ ప్రసాద్, ఆలయ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు సంగీత వీర్రాజు, గ్రామ పెద్ద కాపు తోట వెంకటస్వామి పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



పుస్తకాలతో విద్యార్థులు

మణుగూరు రూరల్: మండల పరిధిలోని పగిడేరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్పంచ్ తాటి సావిత్రి నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పంచాయతీ కార్యదర్శి మణికిరణ్, సభ్యులు కొంగ మహేష్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



వితరణ అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన చాప పాపారావు పూరిల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో దగ్ధమవ్వగా బాధిత కుటుంబానికి బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మంచం, దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, సభ్యులు జక్కిరెడ్డి మల్లారెడ్డి, పుట్టి రాజేష్, కామిరెడ్డి వెంకటరెడ్డి, హనీఫ్, సాయిబాబు, బిజ్జం వెంకట్రామిరెడ్డి, కామిరెడ్డి నరసింహారెడ్డి, అశ్వాపురం పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధితో మారిన పట్టణాల రూపురేఖలు

- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు
- ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విప్ కాంతారావు

మణుగూరు రూరల్: సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలోని పట్టణాల రూపురేఖలు మారాయని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్నేహ గార్డెన్స్‌లో మణుగూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమంతో మున్సిపాలిటీలు అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నాయన్నారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు చేపట్టిన పట్టణ ప్రగతి సత్ఫలితాలను ఇస్తుందన్నారు. రూ.25కోట్లతో మణుగూరు మున్సిపాలిటిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం పక్కన మున్సిపాలిటీ నూతన భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోశం నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ చంద్రమౌళి, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రత తప్పనిసరి



మాట్లాడుతున్న లలిత్‌కుమార్

మణుగూరు రూరల్: ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి అని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్వోటు జీఎం డి.లలిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఏరియా జీఎం కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛత పక్షోత్సవాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30 వరకు స్వచ్ఛత పక్షోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తామన్నారు. సింగరేణియులు, వారి కుటుంబ సభ్యులు బాధ్యతగా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం అధికారులు, మినిస్టీరియల్ స్టాఫ్, కార్యాలయ సిబ్బంది స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సివిల్ డి.వెంకటేశ్వర్లు, డీజీఎంలు కె.వెంకట్రావు, ఎస్.రమేష్, వెంగళరావు, అనురాధ, సర్వే అధికారి శ్రీనివాస్, పర్యావరణ అధికారి శ్రీనివాస్, సీనియర్ సెక్యూరిటి అధికారి షబ్బీరుద్దీన్, సీనియర్ పీఓ సింగు శ్రీనివాస్, పీఏ టు జీఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న బ్రహ్మచారి

భద్రాచలంఅర్బన్: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం 125 గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేసి, ఆ స్థలంలో ఇంటి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఆర్థిక సాయం అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి డిమాండ్ చేశారు. సంఘం పట్టణ కమిటీ సమావేశం మర్లపాటి రేణుక అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భద్రాచలంలో నిర్మాణాలు పూర్తైన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు వెంటనే పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ వృత్తిదారులకు ప్రకటించిన లక్ష రూపాయల పథకం దరఖాస్తుల తేదీని మరొక నెల రోజుల పాటు పొడిగించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి, నాయకులు నకరికంటి నాగరాజు, లక్ష్మీకాంత్, పి.సంతోష్, రాము, రామకృష్ణ, అప్పారి రాము, అరవింద్ బాబు, గుమ్మడి నాగరాజు, జాకీర్, రాజబాబు, చంటి, రమ, శివమ్మ, కాపుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: రైతులకు వ్యవసాయ సీజన్‌లో సకాలంలో విత్తనాలను అందజేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ నాయకుడు దాసరి సాయన్న, రైతు సంఘం డివిజన్ నాయకులు సున్నం వీరభద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ అనుబంధ సంఘాలు ప్రగతిశీల రైతు సంఘం, ప్రగతిశీల కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులందరికీ అవసరమైన ఎరువులు విత్తనాలు సరిపడినన్ని అందించి నకిలీ విత్తనాలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ మణిధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పర్ణశాల నుంచి మారాయిగూడెం వరకు సీతారాంపురం నుండి కొత్తపల్లి వరకు పూడిక తీయించి సాగునీరు అందించాలన్నారు. ఇకనైనా రైతులకు వ్యవసాయానికి పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయించాలని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

18న కొమురం భీం విగ్రహావిష్కరణ

గుండాల: ఈ నెల 18న చెట్టుపల్లి పంచాయతీ కేంద్రంలో కొమురం భీం విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల కార్యదర్శి గోవింద నర్సింహారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొమురం భీం త్యాగాలను భావితరాలకు అందించడం కోసం ఆయన విగ్రహాన్ని నిర్మిస్తున్నామన్నారు.

కనకదుర్గ ఆలయ కమిటీ ఎన్నిక



రామకృష్ణ, అధ్యక్షుడు

భద్రాచలంటౌన్: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆలయ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడిగా చింతాడి రామకృష్ణ, కమిటీ సభ్యులుగా మద్దిబోయిన రాజ్యం, మడకం కృష్ణకుమారి, పుసుగుపాటి సీత, కావూరి సీతామహాలక్ష్మి, కాటపోయిన వెంకటనర్సమ్మలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఈఓ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్ట్ వద్దగల శ్రీ గంగానమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పదహారు రోజుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు మేళతాళాలతో బోనాలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని అభిషేకాలు నిర్వహించి, పూజలు చేశారు.

బెండాలపాడులో తాగునీటి ఇక్కట్లు



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామంలో పది రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. వేసవి ఎండలు మండుతుండగా తాగునీటి ఎద్దడితో ప్రజలగొంతు దాహంతో ఎండుతుంది. విద్యుత్ మోటార్లు మరమ్మతుల బారిన పడి పదిరోజులుగా సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పంచాయితీ పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఏర్పాటు చేసిన ట్యాంకర్ ద్వార ఇంటింటికి తాగునీరు సరఫరా చేస్తుండగా వాటితో సరిపుచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.